క్లుప్తంగా

పనుల పరిశీలన

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని కాలనీలలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీ నగర్‌లో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను మంగళవారం ఆయన కాలనీవాసులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులో నాణ్యత పాటించాలన్నారు.

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవం

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని మారుతినగర్ శ్రీ రేణుకాఎల్లమ్మ తల్లి ఆలయంలో మంగళవారం ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలో కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశ్విన్ సింగ్, వెంకట్‌రెడ్డి, తోట మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వారాహిదేవి నవరాత్రులు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురంలోని కుర్తాళ పీఠం శ్రీ ప్రత్యంగిరా దేవి దేవాలయంలో వారాహిదేవి నవరాత్రుల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుర్తాళం శ్రీద్దేశ్వరి పీఠం ఉత్తర పీఠాధిపతులు ఉత్తరాధికారి శ్రీ దత్తేశ్వరానంద భారతి మహా స్వామి పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణం చేసి ప్రసాదం అందజేశారు. ప్రత్యంగిరా, వారాహిదేవి విశిష్టత గురించి తెలిపారు. నవరాత్రులో భాగంగా ఉదయం అమ్మవారికి 18 రకాల ద్రవ్యాలతో అభిషేకం, అర్చనలు, మహిళలతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌రెడి ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్, దేవాలయ సిబ్బంది విఠల్ శర్మ, నిఖిల్ శర్మ, సువర్ణలత, అరుణ, జయశ్రీ, కనకవల్లి రాధ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవు


భూపతి గట్టుమల్లు

హస్తినాపురం: అక్రమ పార్కింగ్‌లతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భూపతి గట్టుమల్లు హెచ్చరించారు. విజయవాడ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయలకు పార్కింగ్ లేకపోవడంతో వెంటనే పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వనస్థలిపురం పరిసర ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న ప్రైవేటు పాఠశాలలకు రోడ్లపై కాకుండా వెనెకాల నుంచి సాయంత్రం వేళల్లో విద్యార్థులను పంపించాలని సూచించామని, అయినా కొందరూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్ అవుతుందని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గట్టుమల్లు హెచ్చరించారు.

భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మ కల్యాణం

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లోని చింత చెట్టు మహంకాళి దేవాలయంలో మంగళవారం ఎల్లమ్మ కల్యాణం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళలు ఎల్లమ్మను దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం చేశారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, రవికుమార్, రాజు, శంకర్ ముదిరాజ్, సురేష్‌కుమార్, ఉపేందర్, శైలజ జయమ్మ, అశోక్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నాగోలు: గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిన ఘటన ఓ ప్రైవేట్ ఉద్యోగి మృతి చెందిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం . బడంగ్‌పేట, సాయినగర్ ఫేజ్–2కు చెందిన గౌర సంపత్‌కుమార్(42) నగరంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం రాత్రి పని మీద కొత్తపేటకు వచ్చి అర్ధరాత్రి 12.30 సమయంలో తన ద్విచక్ర వాహనంపై ఎల్‌బీనగర్ మీదుగా ఇంటికి వెళ్తే క్రమంలో మెట్రో పిల్లర్ 1677 వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని మృతదేహన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి స్నేహితుడు ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానం

సైదాబాద్: ఆషాఢ మాసం వస్తూనే అందరిలో ఆధ్యాత్మికతను పెంచుతుందని సైదాబాద్ ఫ్రెండ్స్ అసోషియేషన్ అధ్యక్షుడు సుభాష్ కాటేకర్ అన్నారు. బల్కంపేట రేణుకా ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం తరహా మంగళవారం సైదాబాద్ చేపల మార్కెట్‌లో అసోషియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాద వితరణ చేశారు. పూజల్లో సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి, అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దారంతా చెత్త | రోడ్డంతా మురుగు

పేరుకుపోతున్న వ్యర్థాలు | పొంగుతున్న డ్రైనేజీలు


మన్సూరాబాద్ కేబీఆర్ రోడ్డులో పేరుకుపోయిన చెత్తకుప్పలు


డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగడంతో రోడ్డుపై పారుతున్న మురుగు

ఎల్‌బీనగర్: సిబ్బంది నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ లోపం నియోజకవర్గంలోని పలు కాలనీలలో ప్రజలకు శాపంగా మారుతోంది. వర్షాకాలంలో ప్రజలు రోగలబారిన పడే అవకాశం అధికంగా ఉంటుంది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా జీహెచ్‌ఎంసీ పరిధిలో మాన్సూన్ బృందాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునే విధంగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా కిందిస్థాయి సిబ్బంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మాన్సూన్ బృందాలు ఫిర్యాదుల కోసం ఎదురు చూడకుండా కాలనీల్లో పర్యటించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మురుగుతో దుర్వాసన..

నియోజకవర్గంలోని పలు కాలనీల్లో ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకే డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగి మురుగు ఏరులై పారుతోంది. దీంతో రోడ్లు మురుగునీటి కాలువలను తలపిస్తున్నాయి.అటుగా వెళ్లాలంటే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు వేగంగా వెళ్తుండటంతో మురుగు మీద పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ముందే డ్రైనేజీ పైప్‌లైన్, నాలాల్లో పేరుకుపోయిన పూడికను తీయాల్సి ఉండగా తూతూ మాత్రంగా పనులు చేసి వదిలేశారని పలు కాలనీ పంక్షేమ సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పొంగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యవేక్షణ లోపంతో..

నియోజకవర్గంలోని పలు కాలనీల్లో ప్రధాన రహదారుల్లో చెత్త పేరుకుపోయి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.ఎప్పటికప్పుడు తొలగించాల్సిన చెత్తను రెండు మూడు రోజులకు ఒక్కసారి తొలగిస్తుండడంతో చెత్త నుంచి దుర్వాసన వస్తుందని అటుగా వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉంటుందని ఆయా కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త పేరుకుపోతుండటంతో దోమల వ్యాప్తితో కంటిమీద కునుకు లేకుండా పోతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించి డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్: స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సూచించారు. ఓల్డ్‌మలక్‌పేటలోని పద్మానగర్ కాలనీ కమ్యూనిటీ హాల్లో జీహెచ్‌ఎంసీ యూసీడీ విభాగం ద్వారా నిర్వహించిన స్వయం సహాయక గ్రూపు సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం యూసీడీ విభాగం ద్వారా సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు పెద్ద మొత్తంలో ఆర్థిక చేయూతను అందిస్తుందన్నారు. మలక్‌పేట నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌లో అనేక మహిళా సంఘాలను ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేస్తూ ఆర్థిక చేయూత అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ, యూసీడీ అధికారి యుగేందర్ పాల్గొన్నారు.

నూతన డ్రైయిన్ నిర్మాణంతో ముంపు సమస్యకు చెక్


అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: బండ్లగూడ అయ్యప్పనగర్ కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా నూతన డ్రైయిన్ నిర్మాణం చేపట్టాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం నాగోలు డివిజన్ బండ్లగూడ పరిధిలోని అయ్యప్పనగర్ కాలనీలో జలమండలి, ఇరిగేషన్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. డ్రైనేజీ, రోడ్ల సమస్యల గురించి స్థానికులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో పైనుంచి వచ్చే వరదనీటి సమస్యల కోసం ఈ కాలనీ గుండా బాక్స్ డ్రైయిన్ వేయడం జరిగింది ఈ పనులతో ఈ కాలనీకి ముంపు సమస్య తప్పిందన్నారు. అందుకు అనుగుణంగా బండ్లగూడ చెరువు తూములను ఏర్పాటు చేయడం వల్ల పై నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని నాలాల ద్వారా మూసీలోకి మళ్లించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రమేష్ బాబు, శ్రీనివాస్ రెడ్డి, కనకయ్య, సతీశ్, కాలనీవాసులు నర్సింహాచారి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించాలి


మంత్రి లక్ష్మణ్‌కు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

చాదర్‌ఘాట్: ఏఐసీసీ మెనిఫెస్టోలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు వికలాంగులకు స్థానిక సంస్థల్లో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని వికలాంగుల ప్రాతినిధ్య సాధన సమితి చైర్మన్ మహమ్మద్ షఫీ అహ్మద్ ఖాన్ కోరారు. ఈ మేరకు ఆయన సమితి ప్రతినిధులతో కలిసి సోమవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయితీలు, మండల, జిల్లా పరిషత్తులు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఇద్దరేసి వికలాంగులను ప్రభుత్వం నామినేట్ చేయడం ద్వారా ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం పడదని తెలిపారు. ఇప్పటికే పలు రాష్ట్రాలలో ఈ అంశం అమలవుతుందన్నారు. మంత్రిని కలిసిన వారిలో మల్లికార్జున్, యాదగిరి, శబరి చావ్ల, శ్రీకాంత్‌రెడ్డి, మధుసూధన్, భాస్కరాచారి, గణేష్ పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ సి.నారాయణరెడ్డి


వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

వనస్థలిపురం: వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందేలా చూడాలని, అవసరమైన సౌకర్యాల కల్పనకు తగిన నిధులు సమకూరుస్తామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిని సందర్శించిన ఆయన వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. మహేశ్వరం మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల ఇదే ఆసుపత్రిలో నిర్వహిస్తుండడం, ఇదే ఆసుపత్రి ప్రాంగణంలో ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఉండడంతో స్థలం సరిపోవడం లేదని, పార్కింగ్ తదితర సమస్యలు వస్తున్నాయని ఈ సందర్భంగా పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వెల్‌నెస్ సెంటర్‌ను సమీపంలోని ఎన్జీవోస్‌కాలనీలోని మోడల్ మార్కెట్ భవనంలోకి 10 రోజులలోగా మార్చాలని, అక్కడ సెంటర్ కోసం అవసరమైన సదుపాయాలు కల్పించాలని వైద్య శాఖ సీఈ దేవేందర్‌కు సూచించారు. అందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. వచ్చే నెల మళ్లీ సమావేశం ఉంటుందని, ఈలోగా పనులన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య శాఖ అడిషనల్ డీఎంఈ వాణి, కళాశాల ప్రిన్సిపాల్ డా.త్రివేణి, వైస్ ప్రిన్సిపాల్స్ డా.నాగమణి, తకియుద్దీన్, ఆసుపతి ఆర్‌ఎంఓ జయమాల, జీహెచ్‌ఎంసీ డీసీ టి.యాదయ్య, ఏఎంహెచ్‌ఓ నీలిమ, హయత్ నగర్ తహసీల్దార్ జానకి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అబాకస్‌లో సత్తా


విద్యార్థులను సన్మానిస్తున్న నిర్వాహకులు

నాగోలు: నగరంలో నిర్వహించిన 21వ తెలంగాణ ప్రాంతీయ సీప్ ప్రాడిజీ పోటీలు–2025లో రికార్డు స్థాయిలో నాగోలు సీప్ అబాకస్ సంస్థకు చెందిన 14 మంది విద్యార్థులు సత్తా చాటారని సంస్థ హెడ్ రాధిక కుండే తెలిపారు. మంగళవారం నాగోలులోని ఎస్‌వీపీ అబాకస్ సంస్థలో రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా రాధిక కుండే మాట్లాడుతూ.. సీప్ ప్రాడిజీ అనేక వార్షిక అబాకస్, మానసిక అంకగణిత పోటీల్లో పాల్గొన్న చిన్నారులు కేవలం 11 నిమిషాల్లో 200కి పైగా అంకగణిత సమస్యలను పరిష్కారించారని తెలిపారు. వీరిలో నాగోలు చెందిన రితీక్ బొజ్జం, శ్రీ వాత్స్‌రెడ్డి, వల్లపురెడ్డి, కోలిపారా పునీత్ సాయి ప్రథమ స్థానంలో నిలవగా తరుణ్‌సాయి, గుంజి హారిక, గట్టు సౌందర్య, విహాన్ బొజ్జం రెండవ స్థానంలో నిలిచారన్నారు.

వైద్య వృత్తి పవిత్రమైంది

మలక్‌పేట: సమాజంలో వైద్య వృత్తి కీలకమైందని, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, కొత్తపేట్ క్లబ్ స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ లయన్ గూటి హిజ్కియా అన్నారు. మలక్‌పేట ప్రొఫెసర్స్ కాలనీలోని సెయింట్ జేవియర్స్ హైస్కూల్లో జరిగిన డాక్టర్స్ డేకు ఆయన హాజరై విద్యార్థులు సిబ్బందితో కలిసి సేవా కార్యక్రమాల్లో పాల్గొని వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు డాక్టర్ల వేషధారణలో వైద్యవృత్తి ప్రాముఖ్యతను ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలోడాక్టర్ బి. విజయ్ రంగా, ఎస్. కృష్ణ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల


విద్యార్థులతో కలిసి వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాగరాజు

మలక్‌పేట: పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 2,3,4 తేదీలలో ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ ప్రొఫెషనల్ కళాశాలలు 72 గంటల బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కళాశాల యాజమాన్యాలు ఫీజు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెబుతుండటంతో పైచదువులకు దూరమయ్యే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, గౌతమ్, ఝాన్సీ, అనూష, సంగీత, ప్రగతి పాల్గొన్నారు.

వైభవోపేతంగా రథయాత్ర


రథయాత్రలో ఈఓ లావణ్య

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ ప్రాంగణంలోని ఉపాలయమైన శ్రీజగన్నాథ స్వామివారి రథోత్సవం మంగళవారం శ్రీత్రిదండి సౌరబ్ మహారాజ్ సమక్షంలో ఆలయ ఈఓ లావణ్య ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథంపై పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు ఈదులకంటి సత్యనారాయణ రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, తోకటి కిరణ్ కుమార్, శ్రీనివాస్, విష్ణువర్ధన్ రెడ్డి, దుర్గారెడ్డి, గోపాల్‌రెడ్డి, పూల నాగరాజు, కె. కవిత, నరేష్, సంతోష్ కుమార్, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

5న భక్తి కుటీర్ ఆధ్వర్యంలో..

మన్సూరాబాద్: వనస్థలిపురం భక్తి కుటీర్ ఆధ్వర్యంలో ఈనెల 5న సాయంత్రం 4 గంటలకు మన్సూరాబాద్ విజయశ్రీకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి తంగ్రిళ్ల హోమ్స్, మల్లికార్జుననగర్ జంక్షన్, సాయినాథ్‌కాలనీ, అనితానగర్ మీదుగా ఎంఈ రెడ్డి గార్డెన్స్ వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనం అనంతరం భక్తులందరికి అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

బోనాలకు ఘనంగా ఏర్పాట్లు


అమ్మవారి పూజల్లో పాల్గొన్న సుభాష్‌చందర్జీ

సైదాబాద్: పాతబస్తీలో శ్రద్ధాబాద్ మార్కెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో అంగరంగా వైభవంగా నిర్వహించే మహంకాళి జాతర బోనాల మహోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, ఉత్సవాల కమిటీ చైర్మన్ జీ.సుభాష్‌చందర్జీ తెలిపారు. ఉత్సవాల ప్రారంభ వేడుకగా మంగళవారం సైదాబాద్ బస్తీలో శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో సుభాష్‌చందర్జీ, కమిటీ ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక అన్నారు. శ్రద్ధాబాద్ మార్కెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో 46 ఏళ్లగా మహంకాళి జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మల్లేష్, రాంకుమార్, సహదేవ్ యాదవ్, పూర్ణచందర్, శ్రీనివాస్, గోపి పాల్గొన్నారు.

కబ్జాకు గురైన పార్కుస్థలం స్వాధీనం


కబ్జా గురైన స్థలంలో బోర్డు ఏర్పాటు చేసిన హైడ్రా అధికారులు

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని మల్లికార్జున్ హిల్స్‌లో పార్క్ స్థలం కబ్జా కావడంతో అసోసియేషన్ సభ్యులు పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. ఈ విషయంపై పూర్తి ఆధారాలతో హైడ్రా కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. స్పందించిన హైడ్రా అధికారులు నాగోలులోని మల్లికార్జున హిల్స్‌లోని కబ్జాకు గురైన పార్క్ స్థలాన్ని పరిశీలించారు. మంగళవారం హైడ్రా ప్రొటెక్షన్ బృందం వచ్చి పార్కు స్థలంలో బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు పి. యాదయ్య మాట్లాడుతూ.. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి పార్క్ స్థలాన్ని కాపాడిన హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు అన్నారు.

స్వర్ణకార సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాఘవాచారి

చంపాపేట: స్వర్ణకారులను ఆదుకునేందుకు ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా తెలంగాణ లోనూ స్వర్ణకార సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఉపాధి కోల్పోయి స్వర్ణకారులకు అండగా నిలవాలని రాష్ట్ర స్వర్ణకార సంఘ అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి డిమాండ్ చేశారు. మంగళవారం చంపాపేటలోని సంఘ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వర్ణకార చేతి వృత్తిదారుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని స్వర్ణకారులకు ఉపాధి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన వారిలో విశ్వబ్రాహ్మణ స్వర్ణకారుల పాత్ర మరువలేనిదని గుర్తు చేశారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన స్వర్ణకారులపై గత, ప్రస్తుత పాలకులు శీతకన్నుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉపాధి కోల్పోయి 50 ఏళ్లు నిండిన ప్రతీ స్వర్ణకారుడికి ప్రభుత్వం పెన్షన్ అందచేయటంతో పాటు జీఓ నెంబర్ 272 ను సవరణ చేసి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో రత్నమాచారి, లక్ష్మణాచారి, సతీష్‌చారి, వెంకటాచారి, రమేష్‌చారి, నాగరాజు, రామకృష్ణ, భీష్మాచారి, గోవర్ధన్‌చారి పాల్గొన్నారు.

రూ. 50 నోటు చూపి.. సెల్‌ఫోన్లు తస్కరించి

సైదాబాద్‌లో రెచ్చిపోతున్న సెల్‌ఫోన్ దొంగలు

సైదాబాద్: సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ దొంగలు రెచ్చిపోతున్నారు. ఒంటరి వృద్ధులను లక్ష్యం చేసుకొని వారి దృష్టి మరల్చి ఫోన్లు తస్కరిస్తున్నారు. గత నెల 29న సాయంత్రం 7 గంటల సమయంలో సైదాబాద్‌కు చెందిన మహమ్మద్ అన్వర్ (67) తన ఇంటి సమీపంలోని సాయి స్వగృహ దుకాణానికి వెళ్లి మిఠాయిలు కొనుగోలు చేసి బయటకు వచ్చాడు. అప్పుడే షాపు వద్దకు ద్విచక్ర వాహనంపై వచ్చిన ఆగంతకుడు అన్వర్‌తో మీ డబ్బులు కింద పడ్డాయని చెప్పడంతో ఆయన కిందకు వంగి రూ. 50 నోటు తీసుకొని ఇంటికి వెళ్లాడు. జేబులో చూసుకుంటే అతడి సెల్‌ఫోన్ కనపడలేదు.

- అదే రోజు రాత్రి 8 గంటలకు రిటైర్డ్ ఉద్యోగి వనం నాగరాజు (65)ను సైతం ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి మీ డబ్బులు కిందపడ్డాయని బురిడీ కొట్టించాడు. ఆయన కూడా కిందకు వంగి రూ. 50 నోటు తీసుకొని ఇంటికి వెళ్లాడు. ఆయన కూడా జేబులో చూసుకుంటే ఫోన్ కనిపించలేదు. రెండు ఘటనల్లో బాధితులు సోమవారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే గతంలో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన అగంతకులు ఇప్పుడు తమ పంథా మార్చి ఒంటరి వృద్ధులను లక్ష్యంగా చేసుకొని వారి దృష్టి మరల్చి సెల్‌ఫోన్లు కాజేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

మహేశ్వరంలో 'మలబార్' ఆభరణాల పరిశ్రమ

- రేపు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


ప్రారంభోత్సవానికి సిద్ధమైన పరిశ్రమ

మహేశ్వరం: మండల పరిధిలోని కేసీ తండా ఎలక్ట్రానిక్ పార్కులో మరో భారీ పరిశ్రమ రూపుదిద్దుకుంది. సుమారు రూ.750 కోట్ల నిధులతో 3.7 ఎకరాల విస్తీర్ణంలో 2.3 లక్షల చదరపు అడుగుల్లో నిర్మించిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తయారీ పరిశ్రమ ఆవిష్కరణకు తుది ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ పరిశ్రమను గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించేందుకు యాజమాన్యం యోచిస్తోంది. ఈ కంపెనీ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇక్కడ పూర్తి స్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం, డిజైనింగ్ స్టూడియో, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏడాదికి సుమారు పది టన్నుల బంగారు ఆభరణాలు, 1.5 లక్షల క్యారెట్ల వజ్రాభరణాలు తయారు చేయగల సామర్థ్యం ఈ యూనిట్ సొంతం . సుమారు 700 మంది స్థానికులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారు. ఈ పరిశ్రమ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు తదితరులు హాజరుకానున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని భవాని ఎన్‌క్లేవ్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం కాలనీలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీ.ప్రశాంత్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, గాయత్రి, ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డి, కోశాధికారిగా యం ఎన్‌బీ చారి, సంయుక్త కార్యదర్శిగా నరసింహ, స్పందనను ఎన్నుకున్నారు.